మౌలిక వసతుల కల్పనకు కృషి

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన కాలనీలో నూతన డ్రైనేజీ పైపులైన్స్‌పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ ప్రియాంక, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్, సూపర్‌వైజర్ నరేంద్ర, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడలో 22 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిల్వకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కూకట్‌పల్లి: ప్రయివేట్ ఇంజినీరింగ్ జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని, అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే గుండ్ల కార్తిక్ కోరారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. బీ కేటగిరి సీట్ల మేనేజ్‌మెంట్ ద్వారా అక్రమంగా అమ్మకాలు, మెరిట్‌కు వ్యతిరేకంగా డొనేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పించటం వంటి అంశాలపై మాట్లాడారు.

ఘనంగా పాపనాశేశ్వరం ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: మూసాపేట, హబీబ్‌నగర్ ప్రాంతంలోని అత్యంత పురాతనమైన పాపనాశేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాంతారావు సౌజన్యంతో ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పవన్, వినోద్, గోపి, భగవంత్, శేఖర్, సత్యమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- పనుల పరిశీలన, అధికారులతో సమీక్ష



సమీక్షలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులను పరిశీలించి వార్డు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూసఫ్‌నగర్ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. పైపులైన్ పనులు పూర్తి చేసి, దానిపై మట్టి వేయాలన్నారు. సుందరీకరణ చేసే విధంగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం వార్డు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అల్లాపూర్ డివిజన్‌లో ఒకప్పుడు ట్రాఫిక్ సమస్య, వర్షం వస్తే బురదతో అస్తవ్యస్తంగా ఉండేదని, నేడు ఎక్కడికక్కడ సీసీ రోడ్లు నిర్మించుకుని నీటి, డ్రైనేజీ పైపులైన్ల వ్యవస్థను అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. ఇంకా పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. మైసమ్మ చెరువును అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు 66 కోట్ల రూపాయలతో పనులు కూడా చేపట్టామని, డ్రైనేజీ వాటర్ ఎట్టి పరిస్థితుల్లో చెరువుల్లో కలవకుండా ప్రణాళికలు చేపట్టామని తెలిపారు. సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో కట్ట నిర్మించటం వల్ల అక్కడ నీరు నిల్వకుండా ఉంటుందని, వర్షాలు వచ్చినా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. పది ఏళ్ల కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో అల్లాపూర్‌లో ముస్లిం, హిందూ శ్మశాన వాటికలు, ఎక్కడికక్కడ కమ్యూనిటీ హాల్స్, పార్కులు, ఇండోర్ స్టేడియాలు, సీసీ రోడ్లు, నీటి, డ్రైనేజీ పైపులైన్‌ల వ్యవస్థను దాదాపు 80 శాతం పూర్తి చేసుకోగలిగామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, అన్ని విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్య చెప్పుకుంటున్న వృద్ధురాలు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మురుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం హనుమాన్‌నగర్‌లో అధికారులతో రివ్యూ మీటింగ్‌లో పలు సమస్యలపై చర్చించారు. చెత్త డంపుతో కంపు కొడుతున్న ప్రాంతానికి అధికారులను తీసుకెళ్లి పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు కృషి చేయాలని, అవసరమైతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలయ్యేలా చూస్తానని చెప్పారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ అఖిల్, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్,, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, కృష్ణ, సచిన్, హరినాథ్, యాదగిరి, శ్యామ్, మోహన్, హనుమాన్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోచయ్య, సెక్రటరీ రవి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు విజయవంతమైన పాలనను పురస్కరించుకొని బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ కాలనీ, రోడ్డు నెంబర్ 2, ధనలక్ష్మి గ్రౌండ్ ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం చాయ్‌పే చర్చ కార్యక్రమంలో పాల్గొని ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం సాధించిన అభివృద్ధి, బీజేపీ విధానాలు, భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షులు వినోద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు ఆకుల రాము, వేణుగోపాల్, సీనియర్ నాయకులు భగవంత్ రెడ్డి, సూరిబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

మూసాపేట: కూకట్‌పల్లిలోని రంగనాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, శుక్రవారం ఉదయం 10:30 గంటలకు రంగనాయక స్వామి కల్యాణోత్సవం, అనంతరం అన్న సమారాధన, సాయంత్రం ఊరేగింపు, శనివారం ఉదయం 7.30 గంటలకు తులసి దళార్చన, ఆదివారం ఉదయం చక్రతీర్థం, శ్రీ పుష్ప యాగం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కోమటిబస్తీలో నివసించే సత్యనారాయణ (66) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య పనికి వెళ్లటంతో ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రణాళికలతో ముందుకెళ్లాలి

- వర్షాకాలం దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వర్షాకాలం దృష్ట్యా అధికారులు ముందస్తు ప్రణాళికలతో ముందుకెళ్లాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందుతు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి పార్టు, వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌లలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కాలనీల్లో నెలకొన్న రోడ్ల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని, అవసరం ఉన్న చోట కొత్త ప్రతిపాదనలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈఈ గోవర్ధన్, ఈఈ కిష్టప్ప, డీఈ ఆనంద్, ఏఈలు రాజీవ్, నిఖిల్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడకు చెందిన కట్ట ప్రసాద్‌రావుకు రూ. 40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం బాధిత కుటుంబ సభ్యుడికి పీఏసీ చైర్మన్ గాంధీ హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి చెక్కును అందజేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, డీసీ గంగాధర్‌ను మంగళవారం కలిసి కూకట్‌పల్లి పార్టు, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్ నగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళ్లి అధిక మొత్తంలో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- ఎన్‌సీబీ హైదరాబాద్ జోన్ సూపరింటెండెంట్ అభిష్ చక్రవర్తి

కేపీహెచ్‌బీకాలనీ: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎన్‌సీబీ హైదరాబాద్ జోన్ సూపరింటెండెంట్ అభిష్ చక్రవర్తి అన్నారు. మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలోని యూజీసీ ఆడిటోరియంలో జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వల్ల శారీరక, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. జైలు శిక్షకు కూడా గురి కావాల్సి వస్తుందని వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్యకు దగ్గరై ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ అనిల్ సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పార్వతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ, రోడ్డు నెంబర్ 2లోని వీరాంజనేయ స్వామి, నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థానంలో 39వ వార్షిక మహోత్సవ పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, సాయంత్రం 7 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగాయి. ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.